క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల ఆర్థికసాయం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న శివాజీ పాణిగ్రహి

ఎల్.ఎన్.పేట: మెళియాపుట్టి మండలం రట్టిని గ్రామంలోని రాధాకృష్ణ ఆలయ నిర్మాణానికి ఎల్.ఎన్.పేట మండలం లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన శివాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఒరియా బ్రాహ్మణ సామాజిక వర్గం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ పాణిగ్రహి రూ.50వేల ఆర్థికసాయం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వసంత పాణిగ్రహి, కమల లోచన పాణిగ్రహి, భీమసేను పాణిగ్రహి తదితరులు గురువారం లక్ష్మీనర్సుపేట గ్రామానికి వచ్చి శివాజీ పాణిగ్రహిని కలిశారు. ఆలయ నిర్మాణ పనులతో పాటు ఈ నెల 19వ తేదీ నుంచి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. చివర దశలో ఉన్న పనులు పూర్తి చేసేందుకు శివాజీ తనవంతు సాయాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. భవానీ శంకర్ పాడి, కృష్ణ పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులకు అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలం: స్థానిక బ్రెలియంట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఈ నెల 5వ తేదీన విశాఖపట్నం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన యునైటెడ్ షాట్ ఖాన్ కరాటే టూ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటారు. ఎం.జ్యోతిక్ సాయి బంగారు పతకం, పి.మోక్షజ్ఞ, ఎస్.మోహిత్, ఎం.లాస్విన్ కాంస్య పతకాలు సాధించారని పాఠశాల జోనల్ ఇన్‌చార్జి ఎస్.రాజకుమార్ తెలిపారు. విద్యార్థులను గురువారం అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ తేజేశ్వరరావు, కరాటే శిక్షకుడు సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

పొందూరు: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఏడు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను మండలంలోని లోలుగు ఉపహార్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గురువారం పంపిణీ చేశారు. ఉపహార్ నేషనల్ డైరెక్టర్ రజిత్‌కుమార్ ఒక్కొక్క కుటుంబానికి బియ్యం, పప్పు, రాగి పిండి, ఆయిల్ ప్యాకెట్లు అందించారు. ఉపహార్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవన ఎరువులతో మేలు



అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

పాతపట్నం: జీవన ఎరువులు ప్రకృతిలో సహజంగా ఉండే సూక్ష్మజీవులు, పంటలకు కావాల్సిన పోషకాలు అందిస్తాయని పర్లాకిమిడిలోని సంచూరియన్ యూనివర్సిటీ అగ్రికల్చర్ సీనియర్ విద్యార్థులు అన్నారు. కొదూరు గ్రామంలో జీవనఎరువులు ఉపయోగంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. జీవన ఎరువు వాడితే మొక్కలకు పోషకాలతో పాటు రోగ నిరోధక శక్తిని అందిస్తుందన్నారు. ఈ ఎరువును అన్ని రకాల పంటలకు వినియోగించవచ్చన్నారు.

29లోగా అనుమతులు పొందాలి



అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శైలేష్ కుమార్

హిరమండలం: వ్యాపార సంస్థలు, దుకాణదారులు తప్పనిసరిగా కార్మిక శాఖ అనుమతులు పొందాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శైలేష్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 29లోగా అనుమతులు పొందాలని పేర్కొన్నారు. సచివాలయాలు, మీ-సేవ కేంద్రాల్లో ధ్రువపత్రాలు పొందుపరచాలన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు సైతం విధిగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించండి

మెళియాపుట్టి: పుట్టిన పిల్లల నుంచి 40 ఏళ్ల లోపు వారందరికీ సికిల్ సెల్ ఎనీమియా (రక్తహీనత) వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని ఎంపీడీఓ కొండలరావు, వైద్యులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఎన్ఎంలతో గురువారం సమీక్షించారు. మండలంలో అన్ని గ్రామాల్లోనూ రక్త పరీక్షలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి వ్యాధిగ్రస్తులకు పెన్షన్ సైతం అందిస్తుందన్నారు. రక్త పరీక్షల నిర్వహణ వేగవంతం చేయాలన్నారు. వైద్యులు హేమంత లక్ష్మి, శివకుమార్, పావని, గ్రీష్మ ఉన్నారు.

ప్రగతికి బాటలు



రావివలస వద్ద కొత్తగా వేసిన రహదారి (నేడు)



అధ్వానంగా ఉన్న రహదారి (నాడు)

- రూ.1.50 కోట్లతో రహదారి నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, ప్రజలు

సరుబుజ్జిలి: మండలంలోని కొండవలస జంక్షన్ నుంచి పురుషోత్తపురం వరకు స్పీకర్ తమ్మినేని సీతారాం చొరవతో రూ.1.50 కోట్ల ఆర్అండ్‌బీ నిధులతో 6 కిలో మీటర్లు మేర సీసీ, బీటీ రహదారి నిర్మించారు. గత పాలకుల హయంలో రహదారి మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు నానా అవస్థలు పడేవారు. రహదారిపై భారీ గుంతలు ఏర్పడి, వర్షాకాలంలో నీరుచేరి తరచూ ప్రమాదాలు జరిగేవి. ఈ రహదారిలో మునగవలస, పాలవలస, రొట్టవలస తదితర గ్రామ స్తులు అధికంగా ప్రయాణాలు చేసే సమయంలో నరకయాతన అనుభవించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రహదారి దుస్థితిని స్పీకర్ దృష్టికి స్థానికులు తీసుకువచ్చిన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించి రోడ్డును నిర్మించారు. రహదారి బాగుపడిందని ప్రజలంతా సంతోషం వ్యక్తం చేశారు.



ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు



గ్రామంలోనే విత్తనాలను సరఫరా చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆర్‌బీకే సిబ్బంది (నేడు)

- ఎరువులు, విత్తనాల కోసం గతంలో పడిగాపులు
- ప్రస్తుతం ఆర్‌బీకేల ద్వారా గ్రామంలోనే అందజేత..



గతంలో విత్తనాల కోసం మండల కేంద్రం వద్ద రైతుల పడిగాపులు (నాడు)

ఆమదాలవలస రూరల్: గత ప్రభుత్వ హయాంలోవ్యవసాయం చేయాలంటేనే రైతులు భయపడేవారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు వంటివి కొనుగోలు చేయాలంటే కష్టంగా భావించేవారు. గంటల తరబడి మండల కేంద్రంలో రైతులు పడిగాపులు కాస్తే కొంత మందికి విత్తనాలు, ఎరువులు అందేవి. మరికొందరికి అందకపోవడంతో ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసేవారు. ఇదంతా గత ఐదేళ్ల కిందటి మాట. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగించడంతో వ్యవసాయం పండగలా మారింది. ఖరీఫ్, రబీల ప్రారంభానికి ముందే ఎరువులు, విత్తనాలు నేరుగా గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ఇంటి వద్దకే వస్తున్నాయి. వ్యవసాయశాఖ నుంచి ఎటువంటి సలహాలు, సూచనలు కావాలన్నా గ్రామస్థాయిలోనే అందడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. రైతులు ఆనందంగా వ్యవసాయాన్ని సాగు చేసుకుంటున్నారు.

నేటినుంచి సామాజిక తనిఖీలు

పొందూరు: మండలంలో 2022-23లో చేపట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించి శుక్రవారం నుంచి సామాజిక తనిఖీలు నిర్వహించనున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ సి.హెచ్.సూర్యానారాయణ రావు మాట్లాడుతూ 29 గ్రామాల్లో వేతన వ్యయాలు రూ.8.83 కోట్లు, మౌలిక వసతుల భవనాల నిర్మాణాలకు రూ.4.62 కోట్లతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నామన్నారు. ఏపీఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఇంజినీరింగ్ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

ఎల్.ఎన్.పేట: మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడి భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మన అందిరిపైన ఉందని లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్, దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.కె.మిశ్రో అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలోని జగన్నాథస్వామి ఆలయం వద్ద కోలాట నృత్య ప్రదర్శన శిక్షణ పొందుతున్న సభ్యులతో సమావేశం నిర్వహించారు. కోలాట నృత్య శిక్షకురాలు ఉర్మిళా పట్నాయక్‌ను సత్కరించారు. నృత్య కళలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. కోలాట నృత్య ప్రదర్శనకు తోడ్పాటు అందిస్తున్న గ్రామ పద్దలు ఊణ్న పకీరు, ఉప సర్పంచ్ ఆశోక్ పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

యాత్ర-2కు అపూర్వ ఆదరణ

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బయోపిక్‌ను ఆధారంగా చేసుకుని చిత్రీకరించిన యాత్ర-2 గురువారం విడుదల కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ కనిపించింది. స్థానిక లక్ష్మీ థియేటర్‌లో ఈ సినిమా ప్రదర్శించారు.

నరసన్నపేటలోని పార్టీ కార్యాలయం నుంచి వైఎస్సార్ కూడలి వరకు పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బీసీ జోనల్ కన్వీనర్ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు చింతు రామారావు, గుప్త, సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీఎం జగన్, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ బ్యానర్లకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం సినిమాను తిలకించి సందడి చేశారు. సినిమా ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నామన్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణదాస్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

నరసన్నపేట: మండల కేంద్రంలో సీసీ రోడ్లు నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. రూ.2 కోట్ల నిధులు వెచ్చించి పలుచోట్ల రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా నరసన్నపేట చెరువు గట్టుపై నుంచి ఎన్‌హెచ్ రోడ్డును కలుపుతూ చేపడుతున్న రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. రూ.20 లక్షలతో ఈ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. మారుతీనగర్-1 వీధిలో కూడా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, వార్డు సభ్యులు కేసీహెచ్‌బీ గుప్త, వైఎస్సార్‌సీపీ నాయకులు పాగోటి రాజారావు, ముద్దాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ మురళి

సంఘాలన్నీ ఏ-గ్రేడ్‌లో ఉండాలి

హిరమండలం: స్వయంశక్తి సంఘాలన్నీ ఏ-గ్రేడ్‌లో ఉండాలని ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్ అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో పాతపట్నం క్లస్టర్ పరిధిలోని పాతపట్నం, మెళియాపుట్టి, మందస, హిరమండలం, కొత్తూరు మండలాల వైకేపీ ఏసీలు, ఏపీఓలు, సీసీలతో గురువారం సమీక్ష నిర్వహించారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. డీపీఓలు మోహన్‌రావు, నారాయణరావు, రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ విద్యాసాగర్

నేడు డీవార్మింగ్ డే

జలుమూరు: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జలుమూరు పీహెచ్‌సీ మెడికల్ అధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం సైరిగాంలో వైద్యాధికారి గురునాథరావు, అచ్చుతాపురం మెడికల్ అధికారి పూజారి సుజాత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 9న మండలంలోని చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. పర్యవేక్షలు చిన్నరాజులు, విస్తరణ అధికారి శిమ్మ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో 4,300 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయటం లక్ష్యంగా తీసుకున్నామని ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ఎస్.సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇప్పటికే శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలతోపాటు ఇంటింటికీ వెళ్లి మాత్రలు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు.

హిరమండలం: డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని ఎంఈఓ రాంబాబు సూచించారు. డీ వార్మింగ్ డేకు సంబంధించి పోస్టర్లను మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఆవిష్కరించారు. దొర్లంగి, హిరమండలం పీహెచ్‌సీ వైద్యులు, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన విద్యుత్ సామగ్రి

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న నాడు-నేడు పెండింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఎంఈఓ రాంబాబు ఆదేశించారు. నాడు-నేడు పథకంలో భాగంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాలకు విద్యుత్ సామగ్రి గురువారం ఎమ్మార్సీకి చేరుకుంది. వాటిని స్థానిక సిబ్బంది భద్రపర్చారు. పాఠశాలల వారీగా సరఫరా చేయనున్నారు.



విద్యుత్ సామగ్రిని పరిశీలిస్తున్న ఎంఈఓ

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి

జలుమూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి అమలు చేస్తున్న జగనన్న గోరుముద్దలో భాగంగా మధ్యాహ్న భోజనం రుచి, శుభ్రంగా ఉండాలని ఎంఈఓ బి.ప్రసాదరావు అన్నారు. కొండపోలవలస ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉందో తెలుసుకున్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధవహించాలన్నారు. వంట ఏజెన్సీ మహిళలకు సూచనలు చేశారు. ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

వసతి గృహాల సందర్శన



ఎస్సీ బాలికల వసతి గృహంలోని సౌకర్యాలపై ఆరా తీస్తున్న సివిల్ జడ్జి

నరసన్నపేట: మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు గురువారం సందర్శించారు. సిబ్బంది పనితీరు, పరిసరాలు, వసతి గృహాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఇతర వసతి గృహాలతో పోల్చితే ఇవి చాలా బాగున్నాయన్నారు. మేట్రిన్లు సూర్యప్రభ, పద్మావతి పనితీరును అభినందించారు. బీసీ సహాయ సంక్షేమ అధికారి త్రినాథరావు ఉన్నారు. అనంతరం స్థానిక సబ్‌జైల్‌ను పరిశీలించారు. రిమాండ్ ఖైదీలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

మహా సంకల్ప సభను విజయవంతం చేయండి

పొందూరు: విశాఖపట్నం జిల్లా పాయకరావుపేటలో ఈనెల 10న నిర్వహించనున్న దళితవాడ పంచాయతీ సాధన మహా సంకల్ప సభను విజయవంతం చేయాలని అంబేడ్కర్ ఇండియా మిషన్(ఏఐఎం) జిల్లా ఉపాధ్యక్షుడు సీర రాము పిలుపునిచ్చారు. పొందూరులో ఏఐఎం సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సభకు భారీ ఎత్తున ఏఐఎం సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వరరావు

పాతపట్నం: ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని పాతపట్నం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఐదు మండలాల తహసీల్దార్లు, ఎన్నికల సూపర్‌వైజర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐదు మండలాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నామన్నారు. అనంతరం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.

● సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే కృష్ణదాస్



సీఎం వైఎస్ జగన్‌మోహన రెడ్డిని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ వద్ద సీఎం జగన్‌ను కలిసి పలు రాజకీయ అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను సీఎం జగన్ ఆత్మీయంగా పలకరించారు. జిల్లాల్లో అన్ని ఎమ్మెల్యే స్థానాలను గెలిపించుకుని రావాలని సీఎం జగన్ సూచించినట్లు ఎమ్మెల్యే కృష్ణదాస్ సాక్షికి తెలిపారు.

- నరసన్నపేట

స్పీకర్ తమ్మినేనికి పుట్టినరోజు శుభాకాంక్షలు



ఎల్.ఎన్.పేట: స్పీకర్ తమ్మినేని సీతారాంకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



బూర్జ: స్పీకర్ తమ్మినేని సీతారాంకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

ఎల్.ఎన్.పేట: శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం అభినందనలు తెలిపారు. స్పీకర్ పుట్టినరోజు సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలోని ఆయన చాంబర్‌లో పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బూర్జ: ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాంను అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో ఆయనను మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. స్పీకర్‌ను కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు, టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సూరపు గోవిందరావు, ఉప్పినివలస గ్రామ ఉపసర్పంచ్ కరణం అనిల్‌కుమార్‌నాయుడు, వావిలాపల్లి మురళీకృష్ణ, సాకేటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన

ఆమదాలవలస రూరల్: బ్యాంకుల ద్వారా జరిపే ఆర్థిక లావాదేవీలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సీఎఫ్ఎల్ ఇన్‌చార్జ్‌లు రామారావు, వెంకటేష్ అన్నారు. కలివరంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో కళాజాతా ద్వారా గురువారం అవగాహన కల్పించారు. ఆర్థిక అక్షరాస్యతతో కుటుంబం అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. కుటుంబంలో ఉన్న సభ్యులు పొదుపు చేయడం వల్ల భవిష్యత్‌లో అవసరాలకు ఆసరాగా నిలుస్తుందన్నారు. పొదుపు చేయడం ప్రతిఒక్కరూ అలవాటు చేసుకుంటే అనవసర ఖర్చులు తగ్గి కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటుందన్నారు. బ్యాంకుల్లో ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏటీఎం కార్డుల వినియోగం, డిజిటల్ మోసాల గురించి వివరించారు. వెలుగు క్లస్టర్ సీసీ చంద్రరావు, వీఓఏ టి.శ్యామల, కళాజాతా బృందం సభ్యులు కె.శంకరరావు, కె.రామారావు, ఎం.లక్ష్మి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఎఫ్ఎల్‌లు

ఉపాధి హామీ పనుల పరిశీలన

బూర్జ: లచ్చయ్యపేటలోని తమ్మినాడు చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు గురువారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్‌ను తనిఖీ చేశారు. ఉపాధి హామీ పనులు రెండుపూటలా చేపట్టాలన్నారు. కొలతల ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. టీఏ సుజాత, మేట్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

సారవకోట: తొగిరి గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి విగ్రహాన్ని, ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు చేశారు. సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారి విగ్రహం